సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

గురువారం : 8 : ఫిబ్రవరి : 2024



అన్నదాతలకు అండగా..

వరికి మద్దతు ధరపై క్వింటాకు రూ.500 బోనస్ ప్రకటించడంతో ఉమ్మడి జిల్లాలో 2లక్షల మంది రైతులకు ప్రయోజనం చేకూరనుంది. 10లో



కొనసాగుతున్న క్రీడా పోటీలు

అశ్వారావుపేట వ్యవసాయ కళాశాలలో నిర్వహిస్తున్న అంతర్ కళాశాలల క్రీడా పోటీలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. 10లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం 38° / 19°

జిల్లాలో గురువారం పగటి ఉష్ణోగ్రతలు అత్యధికంగా నమోదవుతాయి. రాత్రి వేళ కూడా చలి ప్రభావం కొంతమేర తగ్గుతుంది.

న్యూస్‌రీల్

వైభవంగా రామయ్య నిత్య కల్యాణం

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామివారి నిత్యకల్యాణ వేడుక బుధవారం వైభవంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన, తదితర పూజలుచేశారు. అనంతరం స్వామివారిని మేళతాళాల నడుమ గర్భగుడి నుంచి బేడా మండపానికి తీసుకొచ్చి కొలువుదీర్చారు. అక్కడ విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం అనంతరం స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

న్యాయమూర్తులను కలిసిన డీఎస్పీ



న్యాయమూర్తి సాయిశ్రీకి పుష్పగుచ్ఛం అందిస్తున్న డీఎస్పీ

కొత్తగూడెంటౌన్: జిల్లా కోర్టులలోని న్యాయమూర్తులను కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా రెండో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కె.సాయిశ్రీ, మూడో అదనపు జ్యుడీషినల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ వి.శివ నాయక్‌ను కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. డీఎస్పీ వెంట లక్ష్మీదేవిపల్లి ఎస్సై పి.సంతోష్ ఉన్నారు.

అమ్మ సేవా సదనంలో తనిఖీ



వృద్ధులతో మాట్లాడుతున్న విజేత

అశ్వారావుపేటరూరల్: అనాథ వృద్ధుల కోసం నిర్వహిస్తున్న అమ్మ సేవా సదనాన్ని జిల్లా సంక్షేమ శాఖ అధికారిణి వేల్పుల విజేత బుధవారం తనిఖీ చేశారు. ఆశ్రమంలో రికార్డులు పరిశీలించారు. వృద్ధులకు సరైన సదుపాయాలు, నీటి వసతి, మరుగుదొడ్లు, భోజన సదుపాయాలు ఎలా ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. ఆ తర్వాత స్థానిక బీఎస్ఆర్ నగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. కేంద్రంలో పిల్లలు, గర్భిణులు, బాలింతల వివరాలు, వారికి పోషకాహారం సక్రమంగా అందుతుందా అనే వివరాలపై ఆరా తీశారు. కేంద్రం ఆవరణలో న్యూట్రీ గార్డెన్‌లో కూరగాయల పంటలను సాగు చేస్తున్న సిబ్బందిని అభినందించారు. కార్యక్రమంలో అమ్మసేవా సదనం బాధ్యులు కూరపాటి అనసూయ, సీడీపీఓ రోజారాణి, సూపర్‌వైజర్లు విజయలక్ష్మి, సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

అవిశ్వాసం నాటి ఘటనపై విచారణ

ఇల్లెందు: ఇల్లెందు మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావుపై ఈనెల 5వ తేదీన అవిశ్వాసం ప్రవేశపెట్టగా, కౌన్సిలర్ కొక్కు నాగేశ్వరరావును లాక్కెళ్లిన ఘటనపై పోలీసులు బుధవారం విచారణ చేపట్టారు. మున్సిపల్ కార్యాలయం సమీపాన పెన్షనర్ భవన్‌లో కౌన్సిలర్లు ఉండగా.. అక్కడి నుంచి మున్సిపాలిటీలోకి వెళ్లే సమయాన నాగేశ్వరరావు ఎమ్మెల్యే కనకయ్య సహా పలువురు అడ్డుకోగా అదే రోజు కేసు నమోదైంది. ఈ మేరకు ఇల్లెందు డీఎస్పీ రమణమూర్తి, సీఐ కరుణాకర్ కార్యాలయం, పరిసరాల్లో పర్యటించి విచారణ నిర్వహించారు.

గురుకుల అధ్యాపకురాలికి డాక్టరేట్



డాక్టరేట్‌తో అరుణ

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెంలోని గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల చరిత్ర అధ్యాపకురాలు డి.అరుణకు డాక్టరేట్ లభించింది. కేయూ ప్రొఫెసర్ డాక్టర్ మనోహర్ పర్యవేక్షణలో ఆమె సమర్పించిన పరిశోధనాత్మక గ్రంథానికి డాక్టరేట్ ప్రకటించారు. ఈ సందర్భంగా అరుణను బుధవారం కళాశాల ప్రిన్సిపాల్ రాజేశ్వరి, అధ్యాపకులు అభినందించారు.

గాడిన పడేదెప్పుడో?



భద్రాచలం రోడ్ రైల్వే స్టేషన్

రైళ్ల రద్దుతో ప్రయాణికుల సతమతం

- బెళగావి ప్రారంభం.. కాకతీయ బంద్
- ఆదాయమార్గాల పైనే దృష్టి పెడుతున్న అధికారులు
- కార్మిక కుటుంబాలకూ సేవలు అంతంతే..

కొత్తగూడెంఅర్బన్ : దక్షిణ అయోధ్యగా పేరు గాంచిన భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయానికి వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు వస్తుంటారు. ఇక సింగరేణితో పాటు జిల్లాలో వివిధ పరిశ్రమలు, కేటీపీఎస్, బీటీపీఎస్ వంటి విద్యుత్ రంగ సంస్థలు ఉన్నాయి. ఇలా పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన జిల్లాకు పలు రాష్ట్రాల నుంచి నిత్యం కార్మికులు, అధికారులు వస్తుంటారు. వీరంతా రైళ్లలోనే రాకపోకలు సాగిస్తుంటారు. అయితే జిల్లాకు నడిచే రైళ్లను అధికారులు తరచూ నిలిపేస్తున్నారు. ఆదాయంపైనే దృష్టి సారిస్తున్నారు తప్ప ప్రయాణికుల వసతుల గురించి పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. దక్షిణ మధ్య రైల్వే సంస్థ బొగ్గు ఉత్పత్తి ద్వారా ఏడాదికి రూ.650 కోట్లకు ఆదాయాన్ని భద్రాచలం రోడ్డు రైల్వే స్టేషన్ నుంచే గడిస్తోంది. కరోనా సమయంలో ఈ స్టేషన్ నుంచి నడిచే రైళ్లను రద్దు చేయగా, ఆ తర్వాత పూర్తి స్థాయిలో పునరుద్ధరించలేదు. నడిచే రైళ్లలోనూ గతేడాది నుంచి పలుమార్లు రద్దు చేస్తూ ప్రయాణికులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. సింగరేణి ఎక్స్‌ప్రెస్ రైలును పలుమార్లు రద్దు చేయగా, మరికొన్ని రోజులు కొద్ది దూరమే నడుపుతున్నారని, ఇలా అయితే తాము గమ్యస్థానానికి చేరడం ఎలా అని పలువురు ప్రశ్నిస్తున్నారు.

వినతులు బుట్టదాఖలే..

రద్దయిన రైళ్లను ప్రారంభించాలని కోరుతూ కొవ్వూరు రైల్వే లైన్ సాధన సమితి ఆధ్వర్యంలో రైల్వే శాఖ మంత్రి, జీఎంలు, ఇతర ఉన్నతాధికారులకు పలుమార్లు వినతిపత్రాలు అందజేశారు. అనేక సార్లు ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. కొత్తగూడెంలోని వ్యాపార సంఘాల వారు కూడా రైల్వే జీఎంకు పలుమార్లు మెయిల్ ద్వారా వినతిపత్రాలు పంపించారు. అయినా అవన్నీ బుట్టదాఖలే అవుతున్నాయి తప్ప రైళ్లు మాత్రం అందుబాటులోకి రాలేదు.

మరోసారి ఆందోళనకు సిద్ధం..

భద్రాచలం రోడ్ స్టేషన్ నుంచి రద్దు చేసిన రైళ్లను పునరుద్ధరించాలని కోరుతూ కొవ్వూరు రైల్వే లైన్ సాధన కమిటీ, అఖిలపక్షం నాయకుల ఆధ్వర్యంలో ఇటీవల రైల్వే స్టేషన్ అధికారులకు వినతిపత్రం అందజేశారు. రైళ్లను పునరుద్ధరించకపోవడంతో స్టేషన్ ముందు ఆందోళన కార్యక్రమాలకు సిద్ధమవుతున్నారు. అయితే ప్రయాణికుల నుంచి ఆదాయం రావడం లేదనే సాకుతోనే రైళ్లను పునరుద్ధరించడం లేదని పలువురు అభిప్రాయపడుతున్నారు. ప్రధానంగా డోర్నకల్, విజయవాడ, కాజీపేట ప్యాసింజర్ రైళ్లలో ప్రయాణించేవారు టికెట్లు కొనుగోలు చేయడం లేదని, అందుకే అధికారులు వాటిని నడిపించేందుకు ఆసక్తి చూపడం లేదనే వాదనలు వినిపిస్తున్నాయి. కొత్తగూడెం జిల్లా కేంద్రంతో పాటు చుట్టుపక్కల స్టేషన్ల నుంచి రూ.కోట్ల ఆదాయం గడిస్తున్న రైల్వే శాఖ టికెట్ల ద్వారా ఆదాయం రాకపోయినా రైళ్లను నడపాల్సిందేనని పలువురు కోరుతున్నారు. రైళ్ల రద్దు విషయమై స్థానిక రైల్వే స్టేషన్ అధికారులను 'సాక్షి' వివరణ కోరగా ఇది తమ పరిధిలో లేదని, దక్షిణ మధ్య రైల్వే ఉన్నతాధికారుల నిర్ణయం మేరకే తాము నడుచుకుంటామని చెప్పారు.

బెళగావి ఇన్.. కాకతీయ ఔట్ !

భద్రాచలంరోడ్ స్టేషన్ నుంచి గతంలో ఏడు రైళ్లు రాకపోకలు సాగించేవి. సింగరేణి ఎక్స్‌ప్రెస్, డోర్నకల్ ప్యాసింజర్, విజయవాడ ప్యాసింజర్, కాజీపేట ప్యాసింజర్, కాకతీయ ప్యాసింజర్, కొల్హాపూర్ ఎక్స్‌ప్రెస్, మణుగూరు సూపర్‌ఫాస్ట్ సర్వీసులు నిత్యం నడిచేవి. ప్రస్తుతం మణుగూరు సూపర్ ఫాస్ట్, బెళగావి, సింగరేణి ఎక్స్‌ప్రెస్ రైళ్లు మాత్రమే నడుస్తున్నాయి. కాకతీయ రైలు కూడా రాకపోకలు సాగిస్తున్నప్పటికీ.. సాంకేతిక కారణాల పేరుతో మంగళవారం నుంచి ఈనెల 11 వరకు రద్దు చేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. ఇటీవలే బెళగావి రైలును ప్రారంభించగా, కాకతీయ రైలును నిలిపివేశారు. దీంతో 'కాకతీయ' ప్రయాణికులకు ఇక్కట్లు తప్పడం లేదు.

ఓటు నమోదు @ 40,420

- ఈనెల 6వ తేదీ వరకు వచ్చిన దరఖాస్తులివే..
- గత ఎన్నికల్లో మొత్తం ఓట్లు 42,679
- ఈసారి పట్టించుకోని పార్టీలు, ఆసక్తి చూపని పట్టభద్రులు



సూపర్‌బజార్(కొత్తగూడెం): వరంగల్ – ఖమ్మం – నల్గొండ ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు మంగళవారం అర్ధరాత్రి వరకు జిల్లాలో 40,420 మంది ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 39, 991 మంది ఆన్‌లైన్‌లో, 429 మంది ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించారు. ప్రతి ఎన్నికల్లో ఓట్లు సహజంగానే పెరుగుతాయి. కానీ ఈ ఎన్నికల్లో మాత్రం గతంతో పోలిస్తే దరఖాస్తుదారులు తక్కువగా ఉండడం గమనార్హం. గత ఎన్నికల్లో పురుషులు 25,425, మహిళలు 17,245, ఇతరులు 9మంది.. మొత్తం 42,679 ఓట్లు ఉన్నాయి. అప్పుడు 52 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశారు. కానీ ఈసారి కొత్త ఓటర్లతో కలిసి ఆ సంఖ్య పెరగాల్సి ఉండగా పాతవారు కూడా పూర్తిస్థాయిలో నమోదు చేసుకోలేదు. ఎమ్మెల్సీ ఉప ఎన్నిక కావడంతో రాజకీయ పార్టీల నాయకులు కూడా అంతగా పట్టించుకోలేదని తెలుస్తోంది. పట్టభద్రులు సైతం ఆసక్తి చూపలేదు.

మండలాల వారీగా వచ్చిన దరఖాస్తులిలా..

మండలం	దరఖాస్తులు	మండలం	దరఖాస్తులు
ఆళ్లపల్లి	244	అశ్వారావుపేట	1282
గుండాల	427	జూలూరుపాడు	1487
కరకగూడెం	616	లక్ష్మీదేవిపల్లి	1559
చంద్రుగొండ	808	బూర్గంపాడు	2133
పినపాక	852	మణుగూరు	2986
సుజాతనగర్	1218	టేకులపల్లి	2054
అన్నపురెడ్డిపల్లి	652	దమ్మపేట	1705
దుమ్ముగూడెం	1049	ములకలపల్లి	883
భద్రాచలం	1952	ఇల్లెందు	4358
చర్ల	1153	పాల్వంచ	4677
చుంచుపల్లి	2315	కొత్తగూడెం	4682
అశ్వాపురం	1328	మొత్తం	40,420

సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ సరెండర్

కొత్తగూడెంరూరల్: జిల్లా సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ బోడా కుమారస్వామిని కలెక్టర్ ప్రియాంక ఆల సరెండర్ చేశారని తెలిసింది. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు తేలడంతో ఈ నిర్ణయం తీసుకోగా.. ఒకటి, రెండు రోజుల్లో ఆదేశాలు రానున్నాయని సమాచారం. ఇటీవల జిల్లాలోని నాయకులగూడెం గ్రామానికి చెందిన సింధు ప్రసవం కోసం ఎంసీహెచ్‌కు రాగా, ఆమెతో పాటు కడుపులోని బిడ్డ మృతి చెందారు. ఈ ఘటనపై కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు డీఎంఈకి ఫిర్యాదు చేయడంతో విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ విధుల్లో నిర్లక్ష్యం, పర్యవేక్షణ లోపం బయటపడడంతో ఆయనను రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖకు సరెండర్ చేసినట్లు తెలిసింది.

ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

విద్యార్థినిని అభినందించిన పీఓ



కార్తీకను అభినందిస్తున్న పీఓ ప్రతీక్‌జైన్

భద్రాచలంఅర్బన్ : ఇల్లెందు గిరిజన ఆశ్రమ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న బాదావత్ కార్తీక అనే విద్యార్థినిని ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్ తన కార్యాలయంలో బుధవారం అభినందించారు. కేరళ రాష్ట్రంలో జరిగిన సైన్స్‌ఫేర్‌కు ఎంపికైన కార్తీక.. ఆ రాష్ట్రంలోని అద్భుత ప్రదేశాలను తిలికించానని, సైన్స్‌కు సంబంధించిన అనేక విషయాలు తెలుసుకున్నానని పీఓతో చెప్పింది. అలాగే గత జనవరి 16న ఢిల్లీలో జరిగిన జాతీయ స్థాయి స్టూడెంట్ సైన్స్ విలేజ్ కార్యక్రమంలో పాల్గొన్నానని, ఇండియన్ ఇంటర్నేనల్ సైన్స్‌లో పాల్గొని ఉత్తమ ప్రదర్శన కనబరిచినందుకు గాను ఉత్తమ విద్యార్థిగా గుర్తింపు పొందానని, జనవరి 26న ఢిల్లీలో జరిగిన పరేడ్‌లో రాష్ట్రపతి ద్రౌపదిముర్ము, ప్రధాని నరంద్ర మోదీని కలిసి మాట్లాడానని చెప్పింది. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్తీకతో పాటు ఉపాధ్యాయురాలిని అభినందించి, సర్టిఫికెట్లు అందజేశారు.

శాంతిభద్రతల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి

జూలూరుపాడు పీఎస్‌ను తనిఖీ చేసిన ఎస్పీ



పోలీసుస్టేషన్ ఆవరణలో పరిశీలిస్తున్న ఎస్పీ రోహిత్‌రాజ్

జూలూరుపాడు: శాంతిభద్రతల పరిరక్షణ విషయంలో పోలీసు సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ రోహిత్‌రాజ్ ఆదేశించారు. జూలూరుపాడు పోలీస్ స్టేషన్‌ను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన రికార్డులు పరిశీలించి, పెండింగ్ కేసులపై ఆరా తీశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ శాంతిభద్రతలను పరిరక్షిస్తూనే అసాంఘిక కార్యకలాపాలు, గంజాయి రవాణా, అమ్మకాలపై నిఘా పెట్టాలని సూచించారు. ఫిర్యాదు చేసేందుకు వచ్చేవారితో మర్యాదగా ప్రవర్తిస్తూ బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని తెలిపారు. ఈకార్యక్రమంలో సీఐలు ఎం.శ్రీనివాస్, నాగరాజు, ఎస్ఐ జీవన్ రాజు పాల్గొన్నారు.

క్రీడాకారుడికి అభినందన

కొత్తగూడెంటౌన్/ భద్రాచలంటౌన్: భద్రాచలంలోని సిటీ స్టైల్ జిమ్ క్రీడాకారుడు గాలి రామ్మోహన్ రావు జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో రాణించగా ఎస్పీ రోహిత్‌రాజ్ బుధవారం అభినందించారు. రామ్మోహన్‌రావు ముంబైలో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో బంగారు పతకం సాధించాడు. ఈకార్యక్రమంలో కోచ్ రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైరాలో ఇంటర్నేషనల్ మోడల్ స్కూల్

- అవసరమైన భూమి సేకరించండి
- అధికారులతో సమీక్షలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



అధికారులతో సమీక్షిస్తున్న మల్లు భట్టి విక్రమార్క

వైరా: వైరాలో ఇంటర్నేషనల్ మోడల్ స్కూల్ నిర్మాణానికి అవసరమైన ప్రభుత్వ భూమిని సేకరించాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అధికారులను అదేశించారు. ఎన్నికల హామీలో భాగంగా ప్రతీ నియోజకవర్గ కేంద్రంలో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన పాఠశాలలు నిర్మించనున్నట్లు చెప్పారు. డిప్యూటీ సీఎం తన స్వగ్రామమైన వైరా మండలం స్నానాల లక్ష్మీపురానికి బుధవారం వచ్చారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులతో సమావేశమై పలు అంశాలపై సమీక్షించారు. వైరాలో 100 పడకల ఆస్పత్రి, షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి స్థలాలు సేకరించాలన్నారు. వైరా నదిపై చెక్ డ్యామ్ నిర్మాణానికి రూ 4.80 కోట్లు మంజూరు కానుండగా.. చేపట్టాల్సిన పనులపై ఇరిగేషన్ ఈఈ బాబూరావు, డీఈ శ్రీనివాసరావుతో ఆరా తీశారు. కాగా, మహాశివరాత్రి సందర్భంగా స్నానాల లక్ష్మీపురంలో జరిగే శ్రీ రామలింగేశ్వర స్వామి జాతర సమయానికి వైరా నదిలో స్నానఘట్టాల నిర్మాణం పూర్తి చేయాలని భట్టి ఆదేశించారు. ఇంకా వర్షాకాలంలో వరద వస్తే లక్ష్మీపురంలో పొలాల్లోకి నీరు చేరకుండా కరకట్ట నిర్మాణానికి ప్రతిపాదనలు సమర్పించాలని తెలిపారు. వైరా రిజర్వాయర్ కుడి, ఎడమ కాల్వల మరమ్మతు, అభివృద్ధి కోసం రూ 87.80 కోట్ల నిధులతో ప్రతిపాదనలు సమర్పించినట్లు అధికారులు వెల్లడించగా పరిశీలిస్తానని తెలిపారు. స్నానాల లక్ష్మీపురం నుండి గండగలపాడు వరకు బీటీ రోడ్డు నిర్మాణ ప్లాన్‌ను మార్చి తల్లాడ రోడ్డుకు కలపాలని, గన్నవరం నుండి రాపల్లె, బ్రాహ్మణపల్లి వరకు లింకు రోడ్లు, శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి ప్రతిపాదనలు సమర్పించాలని ఆదేశించారు.

భూమి స్వాధీనం.. నిర్మాణాల కూల్చివేత

- బీఆర్ఎస్ కౌన్సిలర్ కుటుంబీకుల ఆధీనంలో ఉన్న భూమిపై మోహరింపు
- స్థలం స్వాధీనం చేసుకున్నట్లు ప్రకటించిన అటవీ, పోలీస్ శాఖలు
- కుట్రపూరిత చర్య అని మాజీ ఎమ్మెల్యే హరిప్రియ ఆరోపణ



కోళ్ల ఫారం షెడ్లను కూల్చివేస్తున్న దృశ్యం

ఇల్లెందురూరల్: 15 రోజులుగా అటవీ అధికారుల వరుస సర్వేలు.. పది రోజులుగా నోటీసులు.. మూడు రోజులుగా భూముల స్వాధీనం కోసం ప్రయత్నాలు.. ఇలా తీవ్ర ఉత్కంఠ నడుమ పోలీసు, అటవీ, రెవెన్యూ అధికారులు బుధవారం తెల్లవారుజామున ఎట్టకేలకు మున్సిపల్ కౌన్సిలర్ కొండపల్లి సరిత కుటుంబీకుల ఆధీనంలో ఉన్న భూములను స్వాధీనం చేసుకున్నారు. మండలంలోని రాజీవ్‌నగర్‌తండా సమీపంలో గల సర్వే నంబర్ 549లో సరిత కుటుంబీకుల ఆధీనంలోని గల భూమిని స్వాధీనం చేసుకునేందుకు మంగళవారం రాత్రి అటవీ, రెవెన్యూ అధికారులు చేరుకున్నారు. అయితే కౌన్సిలర్ కుటుంబీకుల ఆధీనంలోని భూమి రెవెన్యూ పరిధిలోకి వస్తుందని, గతంలో రెవెన్యూ అధికారులు పట్టాలు కూడా మంజూరు చేశారంటూ బీఆర్ఎస్ కౌన్సిలర్లు, నాయకులు వారిని అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య కాసేపు వాదోపవాదాలు జరిగాయి. సుమారు రెండు గంటల పాటు చర్చల తర్వాత.. వారం రోజుల్లో రీసర్వే చేసి హద్దులు నిర్ణయిస్తామని అటవీ అధికారులు ప్రకటించడంతో వివాదానికి తాత్కాలిక విరామం దొరికిందని అందరూ భావించారు.

తెల్లవారుజామునే కూల్చివేతలు

కాగా, బుధవారం తెల్లవారుజామున 5:30 గంటలకు రెవెన్యూ, అటవీ, పోలీసు అధికారులు సిబ్బందితో సహా తిరిగి అక్కడికి చేరుకున్నారు. సరిత కుటుంబీకుల ఆధీనంలో ఉన్న 5.2 ఎకరాల భూమిని చుట్టుముట్టారు. లోనికి ఎవరూ రాకుండా జాగ్రత్తలు తీసుకుంటూనే భారీ యంత్రాలతో అందులో ఉన్న కోళ్లఫాం షెడ్లను కూల్చేశారు. నీటి పైపులను ఛిద్రం చేశారు. షెడ్లలో మూడువేల కోళ్లు ఉండగా వాటిని యజమానులు ఇతర ప్రాంతాలకు తరలించడానికి మాత్రం అధికారులు సహకరించారు. కోళ్లఫాం నిర్వహణ కోసం అక్కడి ఇంట్లో ఉంటున్న కూలీలను ఖాళీ చేయించి వారి సామగ్రిని అధికారులు బయట పడేశారు. అనంతరం 5.2 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకుంటున్నట్లు బోర్డు ఏర్పాటు చేశారు.



భారీగా మోహరించిన పోలీసు, అటవీ శాఖ సిబ్బంది



ఎఫ్‌డీఓ వెంకన్నతో మాజీ ఎమ్మెల్యే హరిప్రియ వాగ్వాదం

మరో ఇద్దరి నిర్మాణాలు కూడా..

కౌన్సిలర్ సరిత కుటుంబీల నిర్మాణాలతోపాటు సమీపంలోని న్యాయవాది నర్సింహారావు, మైబెల్లి అనే వ్యక్తులకు చెందిన నిర్మాణాలను కూడా అధికారులు కూల్చివేశారు. అయితే తమకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా నిర్మాణాలు ఎలా కూల్చివేస్తారని బాధితులు అటవీ, రెవెన్యూ శాఖల అధికారులను నిలదీయగా, వారు ఎలాంటి సమాధానం చెప్పలేదు.

నిర్వాసితుల్లో ఆందోళన

జేకే ఓసీ భూసేకరణలో భాగంగా మండలంలోని సీఎస్పీ బస్తీ పంచాయతీ సమీపంలో అటవీశాఖ పరిధిలోని సర్వే నంబర్ 549లో 261.33 హెక్టార్ల భూమి సింగరేణికి అవసరమైంది. ఈ భూమిని అప్పటికే కొందరు రైతులు సాగు చేసుకుంటున్నట్లు సింగరేణి అధికారులు గుర్తించారు. సర్వే ఆధారంగా నిర్వాసిత భూభాగం 154 హెక్టార్లుగా నిర్ణయించారు. 114 మంది రైతు ఆధీనంలో ఉన్న సదరు భూమిని సింగరేణికి అప్పగించేందుకు రెవెన్యూ అధికారులు ఇప్పటికే గ్రామసభ, ఓపెన్ ఫోరం నిర్వహించారు. తాము సాగు చేసుకుంటున్న భూమి కూడా అటవీశాఖ పరిధిలో ఉందని గతంలో చెప్పిన అధికారులు సాగులో ఉన్న రైతులందరికీ పరిహారం ఇస్తామని ప్రకటించగా ఊపిరి పీల్చుకున్నారు. కాగా, తాజా పరిణామాలతో సర్వే నంబర్ 549లోని భూమిని అటవీశాఖ అధికారులు స్వాధీనం చేసుకోవడంతో తమ పరిస్థితి ఏంటని వారు ఆందోళన చెందుతున్నారు. తమకు న్యాయం చేయాలంటూ ఎమ్మెల్యే కోరం కనకయ్యకు వినతిపత్రం అందజేశారు.

అక్రమంగా కూల్చేశారు : హరిప్రియ

మున్సిపాలిటీలో అవిశ్వాసం ప్రక్రియకు నాయకత్వం వహించినందుకే కౌన్సిలర్ సరిత కుటుంబీకుల భూమిని అటవీ, రెవెన్యూ అధికారులు దౌర్జన్యంగా స్వాధీనం చేసుకున్నారని మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ, బీఆర్ఎస్ నాయకుడు దిండిగాల రాజేందర్ ఆరోపించారు. కోళ్ల ఫారాలను కూల్చివేయడం దారుణమన్నారు. ప్రజాపాలన పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ఆస్తులను ధ్వంసం చేస్తోందన్నారు.

పల్లెల్లో పారిశుద్ధ్య పనులు షురూ..



గౌతంపూర్‌లో గ్రామసభకు హాజరైన అధికారులు, గ్రామస్తులు

చుంచుపల్లి: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా పంచాయతీ అధికారులు 481 గ్రామ పంచాయతీల పరిధిలో బుధవారం ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. మొదటి రోజు గ్రామసభలను విజయవంతంగా నిర్వహించారు. ఈ సభలకు గ్రామంలోని మహిళ, యువజన సంఘాలతో పాటు, స్థానిక పెద్దలు, ప్రజాప్రతినిధులను ఆహ్వానించారు. ప్రత్యేకాధికారులు గ్రామ పాలన, పారిశుద్ధ్య చర్యల గురించి ప్రజలకు వివరించారు. గ్రామాల్లోని ఉన్న ప్రధాన సమస్యలను గుర్తించారు. అనంతరం అంతా కలిసి గ్రామాల్లో పర్యటించి శానిటేషన్, తాగునీటి సరఫరా, ఇతర సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టారు.

నేడు నిర్వహించే అంశాలివే..

పారిశుద్ధ్య కార్యక్రమాల్లో భాగంగా గురువారం యువకులు, మహిళలు, అధికారులతో కలిసి గ్రామంలో శ్రమదానం చేస్తారు. ప్రజలకు తడి-పొడి చెత్త వేరు చేయడంపై అవగాహన కల్పించడంతో పాటు పంచాయతీ పరిధిలోని రోడ్లపై ఉన్న గుంతలను పూడ్చివేసే కార్యక్రమం చేపడతారు. జాతీయ రహదారులు ఉంటే ఆ రోడ్లపై చెత్తకుప్పలు, మట్టి దిబ్బలను తొలగిస్తారు.

క్లుప్తంగా

ఇల్లెందు వైస్ ఎంపీపీపై నేడు అవిశ్వాసం

ఇల్లెందురూరల్: ఇల్లెందులో మున్సిపల్ చైర్మన్‌పై అవిశ్వాసం వీగిపోగా, మండల పరిషత్‌లో వైస్ ఎంపీపీపై అవిశ్వాసం తీర్మానానికి సమయం వచ్చింది. మండల పరిషత్ ఉపాధ్యక్షుడు దాస్యం ప్రమోద్‌కుమార్‌పై కాంగ్రెస్ ఎంపీటీసీలు పెట్టిన అవిశ్వాసంపై గురువారం ఓటింగ్ నిర్వహించేందుకు ఆర్డీఓ శిరీష ఆధ్వర్యాన ఏర్పాట్లు చేశారు. ఇక్కడ 16 మంది సభ్యులకు గాను ఒక ఎంపీటీసీపై అనర్హత వేటుపడగా 15 మంది పదవిలో కొనసాగుతున్నారు. అయితే వైస్ ఎంపీపీపై అవిశ్వాసం నెగ్గేందుకు కాంగ్రెస్‌కు పది మంది సభ్యుల మద్దతు అవసరముంది. దీంతో బీఆర్ఎస్ నుంచి గెలిచిన పలువురితో సహా పది మందిని కాంగ్రెస్ నేతలు క్యాంపునకు తరలించారు. ఈమేరకు గురువారం ఉదయం మండల పరిషత్ కార్యాలయంలో ఆర్డీవో సమక్షంలో ఓటింగ్ నిర్వహిస్తామని ఎంపీడీఓ బాలరాజు తెలిపారు. ఇక అవిశ్వాస పరీక్ష నేపథ్యాన బీఆర్ఎస్ ఎంపీటీసీలకు మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ పార్టీ తరపున విప్ జారీ చేశారు.

దుబాయ్ యాత్రలో విషాదం

- గుండెపోటుతో వ్యాపారి మృతి


అశోక్‌రెడ్డి (ఫైల్)

బూర్గంపాడు: ఓ కంపెనీ తరఫున విహార యాత్రకు దుబాయ్ వెళ్లిన వ్యాపారి అక్కడ గుండెపోటుతో మృతిచెందాడు. బూర్గంపాడు మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన ఆవుల అశోక్‌రెడ్డి(35) లక్ష్మీపురం, భద్రాచలం, పాల్వంచ, కొత్తగూడెంల్లో ఏషియన్ పెయింట్స్ డీలర్‌గా కొనసాగుతున్నారు. సదరు సంస్థ ఆధ్వర్యాన తెలంగాణలోని డీలర్లు నాలుగు రోజుల క్రితం దుబాయ్ యాత్రకు వెళ్లారు. అక్కడి ఓ హోటల్‌లో బస ఏర్పాటుచేయగా.. మంగళవారం రాత్రి అశోక్‌రెడ్డికి గుండెపోటు రావడంతో సహచరులు ఆస్పత్రికి తీసుకెళ్తుండగానే మృతి చెందినట్లు తెలిసింది. ఆయనకు భార్య కోటేశ్వరి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ మేరకు మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సహకరించాలని కుటుంబసభ్యులు కోరుతున్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో జైలు శిక్ష

ఇల్లెందు: డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన లారీ డ్రైవర్‌కు రూ. 2వేల జరిమానా, రెండు రోజుల జైలు శిక్ష విధించారు. పట్టణంలోని కరెంటాఫీస్ వద్ద ఎస్సై అప్పారావు, సిబ్బంది వాహనాలు తనిఖీ చేస్తుండగా అనకాల అనిల్‌కుమార్ అనే డ్రైవర్ మద్యం మత్తులో లారీ నడుపుతూ మంగళవారం పట్టుబడ్డాడు. నిందితుడిని బుధవారం కోర్టులో ప్రవేశపెట్టగా 230 శాతం మత్తు ఉన్నట్లు నిర్ధారణ జరిగింది. విచారించిన ఇల్లెందు కోర్టు న్యాయమూర్తి దేవరపల్లి కీర్తిచంద్రికా రెడ్డి రూ.2వేలు జరిమానా, రెండు రోజులు జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. కోర్టు కానిస్టేబుళ్లు మోహన్, అశోక్ విచారణకు సహకరించారు.

మల్లన్న వాగులో మొసళ్లు


వాగు ఒడ్డున ఉన్న మొసలి

గుండాల: మండలంలోని మల్లన్న వాగులో మొసళ్లు తిరుగుతున్నాయి. రోళ్లగడ్డ సమీపాన మల్లన్న వాగు(పోతురాజు గుండం, గుండ్ల మడుగు)లో వారం రోజులుగా మొసళ్లు కనిపిస్తుండడంతో చుట్టుపక్క గ్రామాల గిరిజనులు ఆందోళన చెందుతున్నారు. గతంలో కురిసిన భారీ వర్షాలకు వాగులు ఉప్పొంగి ప్రవహించగా.. వరదతో పాటు మొసళ్లు కొట్టుకొచ్చి ఉంటాయని భావిస్తున్నారు. అయితే, చుట్టుపక్కల గ్రామాల రైతులు యాసంగి పంటలు సాగుకు ఈ వాగు నుంచే విద్యుత్ మోటార్లు, ఆయిల్ ఇంజన్లతో నీరు వినియోగిస్తున్నారు. ఈనేపథ్యాన మొసళ్లు కనిపిస్తుండడంతో వారంతా ఆందోళన చెందుతున్నారు.


బాల కార్మికులతో వెట్టిచాకిరీ

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి మండలంలోని అటవీ కార్యాలయ నిర్మాణంలో ఇతర రాష్ట్రాల నుంచి తీసుకొచ్చిన బాల కార్మికులతో వెట్టిచాకిరీ చేయిస్తున్నారు. ఈమేరకు బుధవారం అందిన ఫిర్యాదుతో సీడీపీఓ కనుకదుర్గ చేరుకుని విచారణ చేపట్టారు. అప్పటికే అక్కడ పనిచేస్తున్న ఓ బాలుడిని సూపర్‌వైజర్ పక్కకు పంపించాడు. దీంతో సీడీపీఓ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పేకాట స్థావరాలపై దాడులు

బూర్గంపాడు: మండలంలోని సోంపల్లి గ్రామ శివార్లలో పేకాట స్థావరాలపై బుధవారం జిల్లా టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించి తొమ్మిది మందిని అదుపులో తీసుకున్నారు. వారి నుంచి రూ. 60,000తో పాటు ఎనిమిది సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.12,595

ప్రత్యేకాధికారులకు సవాల్

- జీపీల బాధ్యతలు అప్పగించిన ప్రభుత్వం
- చాలామంది గ్రామపాలనతో సంబంధం లేని శాఖల అధికారులే..
- పలువురికి ఇప్పటికే పర్యవేక్షణ భారం
- మళ్లీ స్పెషల్ ఆఫీసర్ బాధ్యతలతో సతమతం


పల్లె పాలనపై శిక్షణకు హాజరైన ప్రత్యేకాధికారులు (ఫైల్)

చుంచుపల్లి: ఓ మండల పంచాయతీ అధికారి(ఎంపీఓ) ఇప్పటికే మండలంలోని 18 గ్రామపంచాయతీలను పర్యవేక్షిస్తున్నారు. ఇటీవల సర్పంచ్‌ల పదవీకాలం ముగియడంతో ప్రభుత్వం ఈనెల 2 నుంచి ప్రత్యేక పాలనను తీసుకొచ్చింది. దీంతో సదరు అధికారికి మూడు పంచాయతీల బాధ్యతలు కేటాయించారు. ఇప్పటికే మండల వ్యాప్తంగా పర్యవేక్షిస్తున్న ఆయన మళ్లీ మూడు పంచాయతీల బాధ్యతలు నిర్వర్తించాల్సి వచ్చింది. ఇలా ప్రత్యేక అధికారులుగా నియమితులైన ప్రతీ అధికారికి రెండు చోట్ల బాధ్యతలు నిర్వర్తించడం సవాల్‌గానే మారిందని చెబుతున్నారు.

రెండు నుంచి మూడు జీపీలు

గ్రామపంచాయతీల పాలకవర్గాల పదవీ కాలం ఇటీవల ముగియగా.. ఇప్పట్లో ఎన్నికలు నిర్వహించే పరిస్థితి లేకపోవడంతో ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించింది. ఉమ్మడి జిల్లాలోని 1,070 గ్రామపంచాయతీలకు గాను మొత్తంగా 396 మంది గెజిటెడ్ అధికారులకు స్పెషలాఫీసర్లుగా బాధ్యతలు కేటాయించారు. భద్రాద్రి జిల్లాలో 481 గ్రామపంచాయతీలకు 218 మంది, ఖమ్మం జిల్లాలో 589 గ్రామాలకు 178 మంది అధికారులను నియమించారు. వీరిలో ఒక్కొక్కరికి రెండు నుంచి నాలుగు పంచాయతీల చొప్పున బాధ్యతలను అప్పగించారు. అయితే, ఈ అధికారులందరూ వివిధ ప్రభుత్వ శాఖల్లో కీలకమైన అధికారులే. దీంతో అటు మాతృశాఖ, ఇటు పంచాయతీల విధులు నిర్వర్తిస్తూ సమన్వయం చేయాల్సి ఉంటుంది. కానీ శాఖాపరమైన పనులతో ఒత్తిడి ఎదుర్కొంటున్న వీరికి పంచాయతీల అదనపు బాధ్యతలు అప్పగించడంపై ఒత్తిడి ఎదుర్కొంటున్నారు.

పల్లె పాలనతో సంబంధం లేని శాఖలు

ప్రభుత్వం గతంలో మాదిరి పంచాయతీరాజ్‌శాఖ నుంచే కాకుండా ఇతర శాఖల అధికారులను సైతం గ్రామపంచాయతీల ప్రత్యేక అధికారులుగా నియమించింది. గ్రామపాలనకు సంబంధం లేని తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, పంచాయతీ రాజ్, మిషన్ భగీరథ, ఆర్అండ్‌బీ, జలవనరుల శాఖ, మున్సిపల్, వ్యవసాయం, వైద్య ఆరోగ్యం, ఉద్యానవన, పశుసంవర్ధక, విద్యాశాఖ తదితర శాఖల అధికారులు ఇందులో ఉన్నారు. అనుభవం లేని అధికారులు ఈ బాధ్యతలను నిర్వహించాలంటే కొంత సవాలేనని చెబుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం 2018లో పంచాయతీరాజ్ చట్టంలో మార్పులు చేశాక పంచాయతీల బాధ్యతలు మరింతగా పెరిగాయి. దీని ప్రకారం ప్రజలకు మెరుగైన పాలన అందాలంటే క్రమం తప్పకుండా గ్రామపంచాయతీని సందర్శించి రోజువారీ పనులను పర్యవేక్షించాలి. అలాంటప్పుడు మాతృశాఖలో విధులు నిర్వర్తించడం ఎలా అనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. ఈనేపథ్యాన మంగళవారం భద్రాద్రి, ఖమ్మం కలెక్టరేట్లలో పల్లె పాలన, బాధ్యతలపై స్పెషలాఫీసర్లకు శిక్షణ నిర్వహించి కొంత మేర అవగాహన కల్పించారు.

అనేక బాధ్యతలు

జీపీల ప్రత్యేకాధికారులు రెండు నెలలకోసారి గ్రామసభలు నిర్వహించాల్సి ఉంటుంది. ప్రధానంగా పల్లెల్లో పచ్చదనాన్ని పెంచడానికి నర్సరీల ఏర్పాటు, మొక్కలు నాటించి సంరక్షించటం, ఉపాధి పనులు, రికార్డుల నిర్వహణ, పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరాను పర్యవేక్షించాలి. అలాగే, గ్రామాల్లో సీజనల్ వ్యాధుల కట్టడి, సిబ్బందికి జీత భత్యాలు, పన్నుల వసూళ్లు, విష జ్వరాలు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవడం వంటివి కీలకంగా ఉంటాయి. పలు ఇతర శాఖల్లో పనిచేస్తూ ప్రత్యేక అధికారులుగా నియమితులైన వారు ప్రజా సమస్యల పరిష్కారంలో ఏ మేరకు విజయవంతం అవుతారో తేలాలంటే కొన్నిరోజులు వేచిచూడాల్సిందే.

'పది'లో ఉత్తమ ఫలితాలు సాధించాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాంబాబు


చరణ్‌కు ప్రశంసపత్రం అందజేస్తున్న అదనపు కలెక్టర్

కొత్తగూడెంఅర్బన్: పదో తరగతి పరీక్షల్లో జిల్లా విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా ప్రధానోపాధ్యాయులు కృషి చేయాలని అదనపు కలెక్టర్ పి.రాంబాబు అన్నారు. ఐడీఓసీ సమావేశ మందిరంలో ఎంఈఓలు, ప్రధానోధ్యాయులతో బుధవారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని, వారు కనీసం ఉత్తీర్ణులయ్యేలా చూడాలని చెప్పారు. పరీక్షలు ప్రారంభమయ్యే నాటికి 2, 3 సార్లు తలిదండ్రులతో సమావేశాలు ఏర్పాటు చేసి విద్యార్థుల ప్రగతిని ఎప్పటికప్పుడు తెలియజేయాలని ఆదేశించారు. ఉత్తీర్ణత శాతంలో రాష్ట్రంలో జిల్లాను మొదటి ఐదు స్థానాల్లో నిలపాలని, అందుకోసం ఈ 40 రోజులు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు కష్టపడాలని అన్నారు. అత్యవసరమైతేనే ఉన్నతాధికారుల అనుమతితో సెలవు తీసుకోవాలన్నారు. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. సర్దుబాటులో భాగంగా ఇతర పాఠశాలలకు కేటాయించిన ఉపాధ్యాయులను గురువారం సాయంత్రం లోగా రిలీవ్ చేయాలని ఆదేశించారు. సమావేశంలో డీఈఓ ఎం.వెంకటేశ్వరాచారి, పరీక్షల సహాయ కమిషనర్ మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

దమ్మపేట విద్యార్థికి అభినందన

దమ్మపేట: గతనెల 17 నుంచి 20 వరకు హరియాణా రాష్ట్రంలోని ఫరీదాబాద్‌లో ఇండియా ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్టివల్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'స్టూడెంట్ సైన్స్ విలేజ్' కార్యక్రమానికి హాజరై ప్రతిభ కనబర్చిన దమ్మపేట జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థి రొయ్యల చరణ్‌ను అదనపు కలెక్టర్ రాంబాబు అభినందించారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్‌లో ఆయన ప్రశంసపత్రం అందించారు. కార్యక్రమంలో డీఈఓ వెంకటేశ్వరాచారి, జిల్లా సైన్స్ అధికారి చలపతిరాజు, ఎంఈఓ లక్ష్మి, పాఠశాల హెచ్ఎం ఉషారాణి పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

బీజేపీ జిల్లా అధ్యక్షుడు రంగాకిరణ్


మాట్లాడుతున్న రంగాకిరణ్

చుంచుపల్లి: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పనిచేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కె.వి.రంగాకిరణ్ సూచించారు. పార్టీ జిల్లా కార్యాలయంలో బుధవారం నిర్వహించిన నూతన జిల్లా పదాధికారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశవ్యాప్తంగా మోదీకి అనుకూల పవనాలు వీస్తున్నాయని అన్నారు. ఖమ్మం, మహబూబాబాద్ లోక్‌సభ నియోజకవర్గాల్లోనూ ఈసారి బీజేపీ గెలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పార్టీ శ్రేణులంతా 'గావ్ చలో అభియాన్' కార్యక్రమంలో పాల్గొని పార్టీ నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జంపన సీతారామరాజు, మహబూబాబాద్ పార్లమెంట్ కన్వీనర్ ముస్కు శ్రీనివాస్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు చింతలచెరువు శ్రీనివాసరావు, తాటిపాముల ఐలయ్య, మడివి రవి, జిల్లా ఉపాధ్యక్షులు గుగులోత్ రామచందర్ నాయక్, బిజ్జం శ్రీనివాస్ రెడ్డి, పసుమర్తి సతీష్, నాయకులు ముత్యాల వెంకటేశ్వర్లు, పానిశెట్టి వెంకటేశ్వర్లు, దోమల మహేష్, కుంజా ధర్మా, కొలికపోగు ముసలయ్య, బోడా సురేందర్ నాయక్, చిర్రా సరస్వతి, సలీం, బలగాని గోపీకృష్ణ, భిక్షపతి, నరేంద్రబాబు, బాలరాజు పాల్గొన్నారు.

బెళగావి రైలుకు గాంధీపురంలో హాల్టింగ్

కారేపల్లి: సికింద్రాబాద్ – భద్రాచలం రోడ్(కొత్తగూడెం) మార్గంలో నడుస్తున్న బెళగావి ఎక్స్‌ప్రెస్ రైలుకు కారేపల్లి మండలం గాంధీపురంలో హాల్టింగ్ ఇచ్చారు. ఈ రైలు 5వ తేదీ నుండి మొదలైంది. తొలుత గాంధీపురంలో హాల్టింగ్ ఇవ్వకపోవడంతో సామాజిక కార్యకర్త వేముల రాంమూర్తి రైల్వే అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో గురువారం హాల్టింగ్ ఇవ్వాలని నిర్ణయించారు. సికింద్రాబాద్ నుంచి భద్రాచలం రోడ్ వెళ్లేటప్పుడు ఉదయం 9.44 గంటలకు, తిరుగు ప్రయాణంలో సాయంత్రం 5గంటలకు ఈ రైలు గాంధీపురం చేరుకుంటుందని అధికారులు తెలిపారు.

అరకిలో వెండి, తులం బంగారం స్వాధీనం

సీసీ కెమెరా ఆధారంగా నిందితుడి గుర్తింపు


వివరాలు వెల్లడిస్తున్న సీఐ నాగరాజు రెడ్డి

భద్రాచలంఅర్బన్ : భద్రాచలం వెంకటేశ్వరా కాలనీలోని ఓ ఇంట్లో గతేడాది డిసెంబర్‌లో చోరీకి గురైన అరకిలో వెండి, తులం బంగారాన్ని పోలీసులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. సీసీ కెమెరాల ఆధారంగా నిందితుడిని గుర్తించామని సీఐ నాగరాజురెడ్డి తెలిపారు. ఈ కేసుకు సంబంధించి సీసీ కెమెరాలను పరిశీలిస్తుండగా పాల్వంచకు చెందిన బానోత్ ప్రశాంత్ కనిపించాడని, అతడి ఫొటోను ఆ ప్రాంత పోలీస్‌స్టేషన్‌కు పంపించి, విచారణ చేపట్టామని చెప్పారు. ప్రశాంత్ గతంలో భద్రాచలం, కొత్తగూడెం, పాల్వంచ, ఖానాపురం ప్రాంతాల్లో పలు దొంగతనాలు చేసి జైలుకు వెళ్లొచ్చాడని తమ విచారణలో తేలిందని తెలిపారు. బుధవారం పట్టణంలోని ప్రధాన కూడళ్లలో పాన్ షాపుల్లో తనిఖీలు నిర్వహిస్తుండగా ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఓ వ్యక్తి అనుమానాస్పదంగా తిరగడాన్ని గమనించి పట్టుకుని విచారించగా అతడు బానోతు ప్రశాంత్‌గా తేలిందన్నారు. డిసెంబర్‌లో జరిగిన చోరీ గురించి ప్రశ్నించగా, దాంతోపాటు అదే రోజు పాల్వంచలోని గట్టాయిగూడెంలో ఒక ఇంటి తాళం పగలగొటి సుమారు తులం బంగారం అపహరించానని ప్రశాంత్ వెల్లడించారని సీఐ వివరించారు. కాగా బుధవారం పట్టుబడిన ప్రశాంత్ వద్ద ఉన్న అరకిలో వెండి, తులం బంగారాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ముద్దాయిపై పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని చెప్పారు. ప్రశాంత్‌ను చాకచక్యంగా పట్టుకున్న పోలీసులను ఏఎస్పీ పరితోష్ పంకజ్ అభినందించారు.

త్రుటిలో తప్పిన పెను ప్రమాదం

ఇల్లెందురూరల్: మండలంలోని సీఎస్పీ బస్తీ గ్రామ పంచాయతీ పరిధిలో సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న డివైడర్‌ను ప్రైవేటు ట్రావెల్స్ బస్సు బుధవారం తెల్లవారుజామున ఢీకొట్టింది. నూతనంగా నిర్మాణ పనులు చేపట్టిన కాంట్రాక్టర్ ఎటువంటి సూచిక బోర్డు ఏర్పాటు చేయకపోవడంతో బస్సు నేరుగా నిర్మాణంలో ఉన్న డివైడర్ మీదకు వెళ్లింది. నిర్మాణం తక్కువ ఎత్తులో ఉండడంతో పెను ప్రమాదం తప్పినట్టయిందని బస్సు డ్రైవర్ తెలిపారు. ప్రమాదంలో బస్సు అడుగు భాగం పూర్తిగా ఛిద్రమవడంతో వేరే బస్సులో ప్రయాణికులను గమ్యానికి చేర్చారు.

పోక్సో కేసులో ఐదేళ్ల జైలుశిక్ష

కొత్తగూడెంటౌన్: బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించిన ములకలపల్లికి చెందిన సత్యంబాబుకు పోక్సో కేసులో ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ మొదటి అదనపు జిల్లా జడ్జి ఎం.శ్యాంశ్రీ బుధవారం తీర్పు చెప్పారు. ములకలపల్లికి చెందిన బాలిక 2021 అక్టోబర్ 12న ఇంటి ముందు ఆడుకుంటుండగా అదే గ్రామానికి చెందిన మేడబోయిన సత్యనారాయణ అలియాస్ సత్యంబాబు చాక్లెట్ ఆశ చూపి మాయమాటలు చెప్పి బాలికను ఇంటికి తీసుకెళ్లి అసభ్యంగా ప్రవర్తించేందుకు ప్రయత్నించగా బాలిక తప్పించుకుని పారిపోయింది. ఈ విషయాన్ని తల్లికి చెప్పగా ములకలపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దర్యాప్తు అనంతరం పోలీసులు కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. తొమ్మిది మంది సాక్షులను విచారించిన జడ్జి.. నేరం రుజువు కావడంతో సత్యంబాబుకు పోక్సో చట్టం ప్రకారం ఐదేళ్ల కఠిన కారాగారశిక్షతో పాటు రూ.10 వేల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ రావి విజయ్‌కుమార్, కోర్టు లైజన్ అధికారి ఎం.హరిగోపాల్, కోర్టు డ్యూటీ ఆఫీసర్ ఎం.బిక్కులాల్ సహకరించారు.

డీపీఓ చెంతకు సుదిమళ్ల 'పంచాయితీ'

ఇల్లెందురూరల్: మండలంలోని సుదిమళ్ల గ్రామ పంచాయతీలో వారం రోజులుగా కొనసాగుతున్న విచారణ బుధవారం కొలిక్కి వచ్చింది. పంచాయతీ కార్యదర్శి నాగమణిపై సమగ్ర నివేదికను ఎంపీడీఓ బాలరాజు జిల్లా పంచాయతీ అధికారికి పంపారు. నివేదికలో పొందుపర్చిన అంశాలిలా ఉన్నాయి.. రెగ్యులర్ విధులకు గైర్హాజరవుతూ కేవలం ఆన్‌లైన్ హాజరు కోసం కార్యాలయానికి ఒక గంట మాత్రమే వస్తుండడంతో పాటు వారం రోజులుగా ఉన్నతాధికారుల ఆదేశాలను ఉద్దేశపూర్వకంగా ఉల్లఘిస్తున్నారని పేర్కొన్నారు. గ్రామపంచాయతీ చెక్కులపై తన సంతకాన్ని ఫోర్జరీ చేశారనే సర్పంచ్ ఆరోపణల నేపథ్యంలో చెక్కులను పరిశీలించామని, సంతకాలలో వైవిధ్యాన్ని గమనించామని తెలిపారు. పలు ఆరోపణలపై వ్యక్తిగతంగా 24 గంటల్లో మండల పరిషత్ కార్యాలయానికి హాజరు కావాలని మెమో జారీచేసినా స్వీకరించేందుకు కూడా సుముఖత చూపలేదని, జనవరి 24, 25 తేదీల్లో సెలవు పెట్టిన నాటి నుంచి ఈనెల 3న తండ్రితో మెడికల్ లీవ్ లెటర్‌ను కార్యాలయానికి పంపారని, జనవరి 26 – ఫిబ్రవరి 2 తేదీల మధ్య అనుమతి లేకుండా విధులకు గైర్హాజరయ్యారని నివేదికలో పేర్కొన్నారు.

ఇన్‌చార్జ్ కార్యదర్శిగా అజహర్..

సుదిమళ్ల పంచాయతీ ఇన్‌చార్జ్ కార్యదర్శిగా ముత్తారపుకట్ట కార్యదర్శి అజహర్‌కు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఎంపీడీఓ బాలరాజు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుత కార్యదర్శి నాగమణి మెడికల్ లీవ్‌లో ఉండడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి


సారయ్య మృతదేహం

అశ్వాపురం: మండల పరిధిలోని మంచికంటినగర్ వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. మండలంలోని మనుబోతులగూడెం గ్రామానికి చెందిన గిరిజనులు ఆటోలో మణుగూరు వైపు వెళ్తున్నారు. మంచికంటినగర్ గ్రామం వద్ద అశ్వాపురం వైపు వస్తున్న కారు, ఆటో ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న ఏనిక సారయ్య, గోపయ్య, తలగూరి బాలయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు, స్థానికులు వారిని 108లో మణుగూరు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఏనిక సారయ్య(38) మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

హత్యకేసులో ముగ్గురి అరెస్ట్

- గొడవ నేపథ్యాన హత్య చేసిన భార్య, కుమారుడు
- సహకరించిన మృతుడి కుమార్తె

అశ్వారావుపేటరూరల్: కర్రలతో దాడి చేసి వృద్ధుడిని హతమార్చిన ఘటనలో ఆయన కుటుంబీకులు ముగ్గురిని పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. సీఐ కరుణాకర్, ఎస్సై శ్రీకాంత్ కథనం ప్రకారం.. మండల కేంద్రంలోని షిర్డీ సాయినగర్‌కు చెందిన కోనా భద్రం(72), భార్య రాములమ్మ మధ్య కొన్నేళ్లుగా గొడవ జరుగుతోంది. భద్రం అతిగా మద్యం సేవించి డబ్బు కోసం భార్యతో గొడవ పడడమేకాక వివాహేతర సంబంధాలు మోపుతూ వేధించేవాడు. ఈ క్రమంలోనే 15 రోజుల క్రితం కూడా ఇద్దరి మధ్య గొడవ జరగగా, నాటి నుంచి రాములమ్మ ఆసుపాకలోని కుమార్తె విజయలక్ష్మి ఇంట్లో ఉంటోంది. ఈనెల 2న భద్రం మద్యం సేవించి అక్కడికి వెళ్లి భార్యపై దాడి చేశాడు. అక్కడే ఉన్న కుమారుడు నరేష్ అడ్డుకోగా ఆయనపైనా దాడి చేశాడు. దీంతో భార్య, కుమారుడు కలిసి భద్రం తలపై కర్రతో బలంగా కొట్టారు. తీవ్రంగా గాయపడిన ఆయనను ఆస్పత్రికి తరలిస్తుండగా మధ్యలోనే మృతి చెందాడు. ఈ విషయం బయటకు తెలిస్తే తాము జైలుకు వెళ్లాల్సి వస్తుందనే ఉద్దేశంతో మృతదేహాన్ని ఏపీలోని కొవ్వూరు శ్మశానవాటికలో దహనం చేసేందుకు ప్రయత్నించారు. ఈ విషయమై అనుమానంతో భద్రం మేనల్లుడు గురుమూర్తి స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయగా, హత్య కేసుగా నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఇంతకాలం పరారీలో ఉన్న కోనా నరేష్, రాములమ్మతో పాటు వారికి సహకరించిన కుమార్తె వేముల విజయలక్ష్మి బుధవారం తెల్లవారుజామున అశ్వారావుపేటకు రాగా అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు. నిందితులను కోర్టులో హాజరు పర్చగా, న్యాయమూర్తి రిమాండ్ విధించినట్లు వెల్లడించారు.

ఏడు కిలోల గంజాయి పట్టివేత

జూలూరుపాడు: ద్విచక్రవాహనంపై తరలిస్తున్న గంజాయిని స్థానిక పోలీసులు బుధవారం పట్టుకున్నారు. ఏఎస్సై తిరుపతిరావు తెలిపిన వివరాల ప్రకారం.. పోలీస్ స్టేషన్ ఎదురుగా ఎస్ఐ జీవన్ రాజు సిబ్బందితో కలిసి వాహనాలు తనిఖీ చేస్తుండగా కొత్తగూడెం నుంచి బైక్‌పై వెళ్తున్న ఇద్దరు అనుమానాస్పదంగా కనిపించడంతో అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి ఏడు కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నామని, దాని విలువ రూ. 1.40 లక్షలు ఉంటుందని ఏఎస్సై చెప్పారు. వారిని విచారించగా కొత్తగూడెంలోని రుద్రంపూర్ ప్రాంతానికి చెందిన ఏలుటూరి కార్తికేయ, భేతంపూడి సూర్య చరణ్‌గా తెలిసిందన్నారు. వారిపై కేసు నమోదు చేసి, బైక్‌ను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. సీఐ ఎం. శ్రీనివాస్ పర్యవేక్షణలో దర్యాప్తు చేస్తున్నామని, ఇద్దరినీ అరెస్ట్ చేసి రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించామని తెలిపారు.

దాడి ఘటనపై కేసు నమోదు

మణుగూరు టౌన్: మండలంలోని రామానుజవరం గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగిన దాడి ఘటనలో మణుగూరు పోలీస్‌స్టేషన్‌లో బుధవారం కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. రామానుజవరానికి చెందిన రామకృష్ణ అదే గ్రామానికి చెందిన సలీంపాషా వద్ద కొంతకాలం క్రితం డబ్బు తీసుకున్నాడు. తిరిగి ఇవ్వమని సలీంపాషా మంగళవారం రాత్రి అడగగా రామకృష్ణ సీసాతో దాడి చేశాడు. ఈ ఘటనలో సలీంపాషా తలకు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజేశ్ తెలిపారు. కాగా సలీంపాషా కాంగ్రెస్ కార్యకర్త కావడంతో మండల అధ్యక్షుడు పీరినాకి నవీన్ పరామర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

దేవాలయాల భూముల నుంచి మట్టి తరలింపు


మట్టి తరలింపుపై వివరాలు సేకరిస్తున్న ఈఓ

నేలకొండపల్లి: దేవాదాయ శాఖకు చెందిన భూముల నుంచి కొందరు భారీ ఎత్తున టిప్పర్ల ద్వారా మట్టి తరలిస్తున్నారు. ఇప్పటికే దాదాపు 40 టిప్పర్ల మట్టి తరలించినట్లు తెలుస్తుండగా, స్థానికుల ఫిర్యాదుతో అధికారులు చేరుకుని వివరాలు సేకరించారు. మండలంలోని అమ్మగూడెంలో శ్రీ రాజరాజేశ్వరి, శ్రీ వేణుగోపాలస్వామి ఆలయాలకు 42.17 ఎకరాల భూమి ఉంది. ఇక్కడి నుంచి బుధవారం రాత్రి కొందరు అక్రమంగా టిప్పర్లతో మట్టి తరలిస్తుండగా గ్రామస్తులు దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ఆలయ ఈఓ పి.నారాయణచార్యులు చేరుకునే లోగా టిప్పర్లతో అక్రమార్కులు వెళ్లిపోగా, జేసీబీ మాత్రం ఉంది. దీంతో ఈఓ ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ చేపట్టారు.

ఏడు క్వింటాళ్ల మిర్చి చోరీ

అశ్వాపురం: మండల పరిధిలోని రామచంద్రాపురం శివారులో కల్లంలో ఉన్న ఏడు క్వింటాళ్ల మిర్చిని మంగళవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. గ్రామానికి చెందిన కాశబోయిన వీరన్న ఎకరంన్నర భూమిలో మిర్చి సాగు చేసి, పంటను కోసి కల్లంలో ఆరబోశాడు. బుధవారం మార్కెట్‌కు తరలిద్దామనుకోగా, మంగళవారం రాత్రి చోరీకి గురైంది. దీంతో రైతుకు సుమారు 1.50 లక్షలు నష్టం వాటిల్లింది. గత కొంత కాలంగా రామచంద్రాపురం, నెల్లిపాకబంజర, మల్లెలమడుగు, మొండికుంట, బీజీ కొత్తూరు తదితర ప్రాంతాల్లో పొలాల్లో దొంగతనాలు జరుగుతున్నాయి. మోటార్లు, ట్రాక్టర్ల బ్యాటరీలు, కల్టివేటర్లు, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లలో రాగి తీగ వంటివి చోరీలకు పాల్పడుతున్నారు. పోలీసులు స్పందించి ఈ దొంగతనాలను నివారించాలని రైతులు కోరుతున్నారు.

6,100 పోస్టులతో డీఎస్సీ

- షెడ్యూల్ ప్రకటించిన ఏపీ ప్రభుత్వం
- నేడు టెట్‌కు, 12న డీఎస్సీకి నోటిఫికేషన్ల జారీ

సాక్షి, అమరావతి: ఏపీలో బీఈడీ, డీఈడీ పూర్తి చేసిన అభ్యర్థులకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. మొత్తం 6,100 పోస్టుల భర్తీకి డీఎస్సీ షెడ్యూల్‌ను విడుదల చేసింది. ఈ పోస్టుల్లో 2,280 సెకండరీ గ్రేడ్ టీచర్లు (ఎస్‌జీటీ), 2,299 స్కూల్ అసిస్టెంట్లు (ఎస్‌ఏ), 1,264 ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్లు (టీజీటీ), 215 పోస్టుగ్రాడ్యుయేట్ టీచర్లు (పీజీటీ), 42 ప్రిన్సిపాల్ పోస్టులు ఉన్నాయి. టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్)తో పాటు డీఎస్సీ-2024 నోటిఫికేషన్లకు ప్రభుత్వం షెడ్యూల్ ప్రకటించింది. ఈ మేరకు గురువారం టెట్ నోటిఫికేషన్ విడుదల చేయనుంది. డీఎస్సీ నోటిఫికేషన్‌ను ఈనెల 12న ఇవ్వనుంది. టెట్, డీఎస్సీకి పాఠశాల విద్యాశాఖ వెబ్‌సైట్ http://cse.ap.gov.in ద్వారా చేసుకోవాలి. ఈ మేరకు బుధవారం సచివాలయంలో విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్, కమిషనర్ సురేష్ కుమార్ వివరాలు వెల్లడించారు. నోటిఫికేషన్ ఇచ్చిన రోజు నుంచే ఆయా పరీక్షలకు ఆన్‌లైన్ దరఖాస్తులు కూడా స్వీకరిస్తారు. మొత్తం ప్రక్రియను పూర్తి చేసి, ఏప్రిల్ చివరి నాటికి అభ్యర్థులకు పోస్టింగ్ ఇస్తామని, వారు వచ్చే విద్యా సంవత్సరంలో బోధన కూడా చేపడతారని మంత్రి బొత్స తెలిపారు. తమ ప్రభుత్వం వచ్చాక ఇప్పటివరకు 14,219 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసిందన్నారు. పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్ మాట్లాడుతూ.. ఏపీ టెట్, డీఎస్సీ పరీక్షలు రెండింటినీ ఆన్‌లైన్‌లో కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ)గా నిర్వహిస్తామని స్పష్టం చేశారు.

ఏపీ టెట్, డీఎస్సీ-2024 షెడ్యూల్..

అంశం	టెట్	డీఎస్సీ
నోటిఫికేషన్	ఫిబ్రవరి 8	12
ఫీజు చెల్లింపు	ఫిబ్రవరి 17	21 వరకు
దరఖాస్తు ప్రక్రియ	ఫిబ్రవరి 18	22 వరకు
ఆన్‌లైన్ నమూనా పరీక్ష	ఫిబ్రవరి 19	24
హాల్‌టికెట్లు	ఫిబ్రవరి 23 నుంచి	మార్చి 5 నుంచి
పరీక్ష నిర్వహణ	ఫిబ్రవరి 27 నుంచి మార్చి15	మార్చి 9 30 వరకు
ప్రాథమిక కీ	మార్చి 10	31
తుది కీ	మార్చి 13	ఏప్రిల్ 2
ఫలితాల ప్రకటన	మార్చి 14	ఏప్రిల్ 7





ఏడు రంగుల ఆంధ్ర ధనుస్సు

అన్ని వర్గాల అభివృద్ధి, సంక్షేమం ధ్యేయంగా రూ.2.86 లక్షల కోట్లతో ఓటాన్ అకౌంట్ బడ్జెట్

విద్య, వైద్యం, వ్యవసాయం, సాగునీటికి ప్రాధాన్యం

ద్రవ్య, రెవెన్యూ లోటు తగ్గించే చర్యలు

నాలుగు నెలలకు రూ.88,215 కోట్ల వ్యయానికి అసెంబ్లీకి ప్రతిపాదన



'రోటి, కపడా, ఔర్ మకాన్' ఎవరు అవునన్నా, కాదన్నా ప్రజాస్వామ్య ప్రభుత్వంలో ఇదో నినాదం. ప్రజలకు వీటిని సమకూర్చడం పాలకుల కనీస బాధ్యత. ఇవి అందుబాటులో ఉన్నప్పుడే ఏ కుటుంబమైనా అభివృద్ధి దిశగా అడుగులు ముందుకు వేయడానికి ఉపక్రమిస్తుంది. వీటిని విస్మరించి, గ్రాఫిక్స్‌తో ఎన్ని మేడలు కట్టినా అవి నీటి మూటలేనని చరిత్ర చెబుతోంది. ప్రజల ఆనందాన్ని, వారి బాగోగులను చూసి ఆనందించే వాడే అసలైన పాలకుడని కూడా చరిత్ర వెల్లడిస్తోంది. తాడిత, పీడిత, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు బాసటగా నిలిచినప్పుడే ప్రజా రంజక పాలన అనిపించుకుంటుంది. విద్య, వైద్యం, వ్యవసాయం.. ఈ మూడు రంగాల్లో చేయూత అందిస్తే చాలు, ప్రజలు స్వయం సమృద్ధి దిశగా అడుగులేస్తారని విశ్వ వ్యాప్తంగా విఖ్యాత ఆర్థిక నిపుణులు నొక్కి వక్కాణిస్తుండటం తరచూ వినిపిస్తోంది. ఈ మూడు రంగాల అభ్యున్నతికే ఎన్నో దేశాలు, రాష్ట్రాలు సతమతం అవుతున్న వేళ.. ఇంతకు మించిన సంక్షేమాభివృద్ధిని సాకారం చేస్తూ మన రాష్ట్రంలో వైఎస్ జగన్ ప్రభుత్వం వడివడిగా అడుగులు ముందుకు వేస్తోంది. నవరత్నాల పథకాలు, సప్త స్వరాల్లాంటి థీమ్‌ల ద్వారా ప్రజలకు మరింత మెరుగైన జీవనాన్ని అందించాలనే తపన, తాపత్రయం.. బడ్జెట్‌లో పెద్దపీట వేయడం ద్వారా కళ్లకు కడుతోంది.

రంగాల వారీగా కేటాయింపులు (రూ.కోట్లలో)

రంగం	కేటాయింపు	రంగం	కేటాయింపు
విద్య	33,898	వైద్య, ఆరోగ్యం	17,916
గ్రామీణాభివృద్ధి	17,816	పట్టణాభివృద్ధి	9,546
వ్యవసాయం, అనుబంధ రంగాలు	14,236	సాగునీరు	12,038
గృహ నిర్మాణాలు	7,062	సంక్షేమం	44,668
బీసీ సంక్షేమం	29,001.31	ఎస్సీ సంక్షేమం	9,291.55
ఎస్టీ సంక్షేమం	4,133.73	మైనారిటీల సంక్షేమం	2,242.36

సంక్షేమ శకం



రూ.2,86,389.27 కోట్లతో బుగ్గన ఓటాన్ అకౌంట్ బడ్జెట్

- మన రాష్ట్రానికి ధృడమైన, ఉజ్వల భవిష్యత్తు
- ఏడు ప్రధాన అంశాలతో సీఎం జగన్ వినూత్న పాలన
- గతంలో రెవెన్యూ వృద్ధి రేటు 6 శాతం.. ఇప్పుడు 16 శాతం

ఐదేళ్లలో జీఎస్‌డీపీ వృద్ధి రేటులో 14 నుంచి 4వ స్థానానికి ఎగబాకాం

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం గత ఐదేళ్లలో ఆర్థికాభివృద్ధితో సంక్షేమ రాజ్యాన్ని నెలకొల్పిందని ఆర్థికమంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ చెప్పారు. రానున్న కాలంలో రాష్ట్రానికి ధృడమైన, ఉజ్వల భవిష్యత్తు ఉందన్నారు. బుధవారం అసెంబ్లీలో రూ.2,86,389.27 కోట్లతో 2024–25 ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన బుగ్గన తనకు వరుసగా ఐదేళ్లుగా ఈ అవకాశాన్ని కల్పించిన ముఖ్యమంత్రి జగన్‌కు ధన్యవాదాలు తెలిపారు. సమాజంలో అత్యంత బలహీనులకు ప్రాధాన్యం ఇవ్వడంలో దివంగత వైఎస్సార్ నిబద్ధత, సామాజిక న్యాయం కోసం కృషి చేసిన రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్ఫూర్తితో ముందుకు సాగుతున్నట్లు చెప్పారు. అసమానతలను రూపుమాపడం, వెనుకబడిన వర్గాలకు రక్షణ, సాధికారత, నాణ్యమైన విద్య, వైద్యం, పోషణ, జీవనోపాధి కల్పించటాన్ని నైతిక బాధ్యతగా భావిస్తూ రాష్ట్ర పునర్ నిర్మాణానికి శాయశక్తులా కృషి చేసినట్లు తెలిపారు. ముఖ్యంగా ఏడు అంశాలు సుపరిపాలిత ఆంధ్ర, సామర్థ్య ఆంధ్ర, మన మహిళా మహరాణుల ఆంధ్ర, అన్నపూర్ణ ఆంధ్ర, సంక్షేమాంధ్ర, సంపన్న ఆంధ్రా, భూ భద్ర ఆంధ్ర పేరుతో సీఎం జగన్ చేపట్టిన కీలక సంస్కరణలు సత్ఫలితాలనిచ్చాయంటూ రంగాల వారీగా ప్రగతిని వివరించారు. ఉదయం 11.04 గంటలకు ముహూర్తం ప్రకారం బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన బుగ్గన తన ప్రసంగంలో గాంధీజీ, అబ్రహాం లింకన్, కోఫీ అన్నన్, అమర్త్యసేన్, బీఆర్ అంబేడ్కర్, వివేకానందుడి సూక్తులను ఉటంకిస్తూ మధ్యాహ్నం 1.05 గంటల వరకు సుదీర్ఘంగా మాట్లాడారు. పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమరనాథ్ శాసన మండలిలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

ఐదేళ్లలో 'సుపరిపాలిత ఆంధ్ర'గా..

గడప గడపకు ప్రభుత్వ సేవల ద్వారా బాధ్యతాయుత పాలన

ఎటువంటి లోపాలు లేకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలు

సీఎం జగన్ ప్రభుత్వ ఐదేళ్ల పాలనా సంస్కరణలను ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ప్రసంగంలో ఆర్థిక మంత్రి బుగ్గన

వెలుగు జిలుగుల అన్నపూర్ణ ఆంధ్ర

ఈ 57 నెలల్లో పండుగలా మారిన వ్యవసాయ రంగం

- అడుగడుగునా అన్నదాతను చేయపట్టి నడిపించిన ప్రభుత్వం
- కొత్త పుంతలు తొక్కుతున్న వ్యవసాయ అనుబంధ రంగాలు
- వైఎస్సార్ రైతు భరోసా, ఉచిత పంటల బీమా, పెట్టుబడి సాయం

ఇదిగో.. సామర్థ్య ఆంధ్ర!

సీఎం జగన్ పాలనలో అనతి కాలంలోనే సామర్థ్య ఆంధ్రగా ఆవిర్భావం

మౌలిక వసతులతో... రాష్ట్రం సుసంపన్నం

మౌలిక సదుపాయాల కల్పనకు రూ.43,307.21 కోట్లు

జిల్లా వార్తలు

కొనసాగుతున్న అంతర కళాశాల క్రీడాపోటీలు



వాలీబాల్ ఆడుతున్న బాలికల జట్లు

అశ్వారావుపేటరూరల్: అశ్వారావుపేటలోని వ్యవసాయ కళాశాలలో నిర్వహిస్తున్న అంతర్ కళాశాల క్రీడా పోటీలు బుధవారం మూడో రోజుకు చేరాయి. ఈసందర్భంగా క్రికెట్ పోటీల్లో జగిత్యాల – వరంగల్ జట్లు తలపడగా జగిత్యాల జట్టు గెలుపొందింది. అలాగే, వాలీబాల్ పోటీల్లో రాజేంద్రనగర్ బాలికల జట్టు, టెన్నికాయిట్, చదరంగం పోటీల్లో అశ్వారావుపేట కళాశాల జట్లు, టేబుల్ టెన్నిస్ పోటీల బాలుర విభాగంలో పోటీల్లో అశ్వారావుపేట జట్టు గెలుపొంది ఫైనల్స్‌కు చేరింది. ఇక బాలికల షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో జగిత్యాల కళాశాల జట్టుపై అశ్వారావుపేట కళాశాల విజేతగా నిలిచింది. ఈ కార్యక్రమంలో కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ హేమంత్ కుమార్, ప్రొఫెసర్లు గోపాలకృష్ణమూర్తి, శ్రావణ్‌కుమార్, మధుసూదన్‌రావు, రాంప్రసాద్, శిరీష, పావని, నీలిమ, సిబ్బంది పాల్గొన్నారు.

డోర్నకల్-మిర్యాలగూడ అలైన్‌మెంట్ మార్చాల్సిందే..

- పార్లమెంట్‌లో ఎంపీ నామ నాగేశ్వరరావు



ఖమ్మంమయూరిసెంటర్: ప్రజలు, రైతులకు నష్టం కలిగించేలా ఉన్న డోర్నకల్–మిర్యాలగూడ రైల్వే లైన్ అలైన్‌మెంట్‌ను పునఃపరిశీలించి మార్చాలని బీఆర్ఎస్ లోక్ సభా పక్ష నేత, ఖమ్మం ఎంపీ నామ నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈసందర్భంగా పార్లమెంట్‌లో బుధవారం ఆయన ఈ అంశంపై మాట్లాడుతూ అలైన్‌మెంట్ పురోగతి, తన ప్రతిపాదనలపై ఆరా తీశారు. సారవంతమైన వ్యవసాయ భూములను కాపాడుకునేందుకు గాను రైతులు అలైన్‌మెంట్ మార్చాలని కోరుతున్నారని, ప్రతిపాదిత మార్గంలో విలువైన భూములు, రియల్ ఎస్టేట్ వెంచర్లు, పేదల ఇళ్లు ఉన్నాయని తెలిపారు. దీంతో రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ బదులిస్తూ డోర్నకల్–మిర్యాలగూడ మధ్య కొత్త రైలు మార్గం కోసం సర్వే జరుగుతుండగా, పలు అంశాల ఆధారంగా ముందుకు సాగుతామని వెల్లడించారు. పూర్తిస్థాయిలో డీపీఆర్ సిద్ధమయ్యాక తుది నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

అన్నదాతకు అండగా.. 'పంట' పండింది!

వరి రైతులకు ప్రభుత్వ ప్రోత్సాహకం

- మద్దతు ధరతో పాటు రూ.500 బోనస్
- ఎకరాకు అదనంగా రూ.12,500 ఆదాయం
- ఉమ్మడి జిల్లాలో 2 లక్షల మందికి ప్రయోజనం



వరి పైరు (ఇన్‌సెట్) వరి పైరు నుంచి వస్తున్న ధాన్యం

ఖమ్మంవ్యవసాయం : అన్నదాతలకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త అందించింది. వచ్చే వానాకాలం నుంచి వరి ధాన్యానికి క్వింటాకు రూ.500 చొప్పున బోనస్ ప్రకటించింది. రాష్ట్రంలో దాదాపు 60 శాతం మంది రైతులు వరి సాగు చేస్తూ దేశంలోనే అగ్రభాగాన నిలిచారు. నీటి వనరులు మెరుగవడంతో ఈ పంట సాగుకు ప్రాధాన్యం ఇస్తున్నారు. ఇక రాష్ట్రంలో వరి పండించే జిల్లాల్లో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలు కూడా ప్రాధాన్యత కలిగి ఉన్నాయి. ప్రధానంగా నాగార్జున సాగర్ ప్రాజెక్టు ఖమ్మం జిల్లాకు ప్రధాన నీటి వనరుగా ఉంది. జిల్లాలోని 16 మండలాలకు సాగర్ నీరు అందుతోంది. దీంతో సాగర్ ఆయకట్టు ప్రాంతంలో అధిక విస్తీర్ణంలో వరి సాగు చేస్తున్నారు. ఈ నీటి విడుదలతో జిల్లాలోని పలు ప్రాంతాల్లోని రిజర్వాయర్లు, జలాశయాలకు నీరు చేరి, ఆయా ఆయకట్టు భూముల్లో పంటలు సాగు చేస్తున్నారు. ఖమ్మం జిల్లాలో వరిసాగు విస్తీర్ణం 2.80 లక్షల ఎకరాలుగా ఉంది. భద్రాద్రి జిల్లాలోనూ పలు ప్రాజెక్టులు, జలాశయాలు ఉండడంతో సుమారు 1.60 లక్షల ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు.

2 లక్షల మంది రైతులకు లబ్ధి..

రాష్ట్ర ప్రభుత్వం అందించనున్న బోనస్‌తో ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని 2 లక్షల మందికి పైగా రైతులకు ప్రయోజనం కలుగనుంది. ఖమ్మం జిల్లాలో దాదాపు 1.24 లక్షల మంది, భద్రాద్రి జిల్లాలో 86 వేల మంది రైతులు వరి సాగు చేస్తున్నారు. వీరి పండించే వరికి మద్దతు ధరతో పాటు అదనంగా బోనస్ రానుంది.

ఉమ్మడి జిల్లాలో వరి సాగు, దిగుబడుల వివరాలు

ఖమ్మం జిల్లా		భద్రాద్రి జిల్లా	
వరి సాగు విస్తీర్ణం	: 2,78,299 ఎకరాలు	వరి సాగు విస్తీర్ణం	: 1,56,274 ఎకరాలు
దిగుబడి అంచనా	: 69,57,475 క్వింటాళ్లు	దిగుబడి అంచనా	: 39,06,850 క్వింటాళ్లు
బోనస్	: రూ. 347.87 కోట్లు	బోనస్	: రూ.195.34 కోట్లు
లబ్ధి పొందే రైతుల సంఖ్య	: 1,24,242	లబ్ధి పొందే రైతుల సంఖ్య	: 86,000

మద్దతు ధరకు బోనస్ అదనం..

ప్రతి ఏటా కేంద్ర ప్రభుత్వం వరి ధాన్యాన్ని గ్రేడ్–ఏ, కామన్ రకాలుగా విభజించి మద్దతు ధర ప్రకటిస్తుంది. ఈ ఏడాది గ్రేడ్–ఏ రకం క్వింటాకు రూ.2,203, కామన్ రకానికి రూ.2,183గా నిర్ణయించింది. ఈ ధరలకు అదనంగా రాష్ట్ర ప్రభుత్వం మరో రూ.500 బోనస్ ప్రకటించింది. దీంతో గ్రేడ్–ఏ రకానికి రూ. 2,703, కామన్ రకానికి రూ. 2,683 చొప్పున వచ్చే వానాకాలం సీజన్ నుంచి రైతులకు దక్కే అవకాశం ఉంది. ఎకరాకు సరాసరి 25 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. క్వింటాకు రూ.500 చొప్పున 25 క్వింటాళ్లకు అదనంగా రూ.12,500 వరకు లబ్ధి చేకూరవచ్చని అంచనా.

వరి రైతులకు ఊరట



వరి ధాన్యానికి క్వింటాకు రూ.500 బోనస్ ఇవ్వడం అన్నదాతలకు ఎంతో ఊరట. ఇతర పంటలతో పోలిస్తే వరి సాగు నుంచి ఆశించిన ఆదాయం రావడం లేదు. కేంద్ర ప్రభుత్వం మద్దతు ప్రకటిస్తున్నా పెరిగిన పెట్టుబడి ఖర్చులతో అంతగా ప్రయోజనం కలగడం లేదు. మద్దతు ధరకు అదనంగా రాష్ట్ర ప్రభుత్వం మరో రూ. 500 బోనస్ ఇవ్వడం రైతులకు ప్రయోజకరం.

– చండ పుల్లారెడ్డి, ఈశ్వరమాధారం, కూసుమంచి మండలం

పెట్టుబడులు కలిసొస్తాయి



వరిసాగులో పెట్టుబడులు బా గా పెరిగాయి. అందుకు అనుగుణంగా ఆదాయం లేదు. రాష్ట్ర ప్రభుత్వం బోనస్ ఇవ్వటం పెట్టుబడులకు కొంత ప్రయోజనం కలుగుతుంది. ప్రతి ఏటా 3 ఎకరాల్లో వరి సాగు చేస్తా. దిగుబడులు వస్తున్నా.. ఆశించిన ధరలేక పెట్టుబడి మాత్రమే వస్తోంది. ఈ బోనస్ డబ్బు పెట్టుబడులకు ఉపయోగపడుతుంది.

– అజ్మీరా రాంజీ, మసివాగు తండా, ఇల్లెందు మండలం

బోనస్‌తో ఎంతో మేలు



వరి ధాన్యానికి బోనస్ ఇవ్వడం ఎంతో మేలు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు అదనంగా క్వింటాకు రూ.500 బోనస్ ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందుకు రావటం ఆనందంగా ఉంది.

– తేజావత్ తారాచంద్, 9వ మైలుతండా, టేకులపల్లి మండలం

వరి సాగుకు ప్రోత్సాహకరం



రాష్ట్ర ప్రభుత్వం అందించే బోనస్ వరి సాగు రైతులకు ప్రోత్సాహకరంగా ఉంటుంది. ప్రకృతి వైపరీత్యాలు పంట దిగుబడులపై ప్రభావం చూపుతూ నష్టాలను చవిచూడాల్సి వస్తోంది. ఇలాంటి తరుణంలో రాష్ట్ర ప్రభుత్వం క్వింటాకు రూ. 500 బోనస్ ఇవ్వటం శుభ పరిణామం. వరి పండించే రైతులకు ఈ బోనస్ ప్రోత్సాహకరంగా ఉండే అవకాశం ఉంది.

– నాగండ్ల మోహన్‌రావు, ఎదుళ్లచెరువు, తిరుమలాయపాలెం మండలం

- టమాటాలో అధిక దిగుబడి సాధిస్తున్న రైతు సీతయ్య
- ఎత్తుమడులు, డ్రిప్, మల్చింగ్, పందిరి పద్ధతిలో సాగు



సీతయ్య తోటలో టమాటాలు పరిశీలిస్తున్న అధికారులు

అశ్వాపురం: సంప్రదాయ విధానంలో కాకుండా అధునాతన పద్ధతులు పాటిస్తూ టమాటా సాగు చేసిన అశ్వాపురం మండల కేంద్రానికి చెందిన రైతు గాదె సీతయ్య అధిక దిగుబడి సాధించి ఆదర్శంగా నిలుస్తున్నాడు. ఆయన గత పదేళ్లుగా టమాటా సాగు చేస్తున్నప్పటికీ దిగుబడి ఉంటే మార్కెట్లో ధర లేక.. ధర ఉన్నప్పుడు దిగుబడి రాక ఇబ్బందులు పడ్డాడు. ఈ నేపథ్యాన ఆధునిక పద్ధతుల్లో సాగుకు శ్రీకారం చుట్టి ఇప్పుడు లాభాల బాట పట్టాడు. ఈ ఏడాది మూడెకరాల్లో టమాటా సాగుచేసిన సీతయ్య ఎత్తుమడులు, డ్రిప్, మల్చింగ్, పందిరి పద్ధతులు పాటించాడు. సేంద్రియ ఎరువులే వాడుతుండగా.. ఎకరానికి రూ.లక్ష పెట్టుబడి కాగా.. సుమారు 20 నుంచి 25 టన్నులు దిగుబడి వస్తోంది. తద్వారా ఎకరానికి రూ.3లక్షల నుంచి నుంచి రూ.5 లక్షల వరకు ఆదాయం రావడంతో లాభాలు ఆర్జిస్తున్నాడు. ఈమేరకు భద్రాద్రి జిల్లా ఉద్యాన పట్టు పరిశ్రమ శాఖాధికారి జినుగు మరియన్న తదితరులు సీతయ్య వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించి అభినందించారు. ఈ సందర్భంగా రైతు మాట్లాడుతూ ఎత్తుమడులు, డ్రిప్, మల్చింగ్, పందిరి పద్ధతిలో టమాటా సాగు చేస్తుండగా మంచి దిగుబడి వచ్చిందని తెలిపాడు. మార్కెట్లో ధర కూడా ఉండడంతో లాభాలు వస్తున్నాయని వెల్లడించాడు. ఇటీవల ఒకేరోజు తోట వద్దే 250 బాక్సుల టమాటా అమ్మానని, ఇప్పటివరకు 15 టన్నులు కోయగా ఇంకా దిగుబడి వచ్చే అవకాశముందని తెలిపాడు.

శరవేగంగా అభివృద్ధి పనులు



స్టేషన్ ముఖద్వారంలో నిర్మాణాలు కూల్చివేస్తున్న సిబ్బంది

కొత్తగూడెంఅర్బన్: భద్రాచలం రోడ్డు రైల్వేస్టేషన్ (కొత్తగూడెం)లో అమృత్ భారత్ పథకం కింద ఎంపిక కాగా అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈమేరకు బుధవారం స్టేషన్ ప్రధాన ముఖద్వారాన్ని కూల్చివేశారు. ఈ స్థానంలో మరింత ఆకట్టుకునే రీతిలో నిర్మాణాలు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ పనులు పూర్తికావడానికి ఎనిమిది నెలల సమయం పడుతుందని తెలియగా... ఆతర్వాత స్టేషన్ నూతన కళ సంతరించుకుంటుందని చెబుతున్నారు.

మాతాశిశు మరణాల తగ్గింపుపై ప్రత్యేక శ్రద్ధ



సమావేశంలో మాట్లాడుతున్న పీఓ ప్రతీక్‌జైన్

భద్రాచలంఅర్బన్: మాతా, శిశు మరణాలు తగ్గించడంపై అధికారులు, వైద్యులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్ సూచించారు. భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ శిరీష, జిల్లా ఆస్పత్రుల సమన్వయకర్త డాక్టర్ రవిబాబు తదితరులతో సమావేశమైన పీఓ మాట్లాడారు. ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో అన్ని సౌకర్యాలు ఉన్నా గర్భిణులకు స్కానింగ్ చేయకపోవడంపై కారణాలను ఆరా తీసిన ఆయన ప్రతీ గర్భిణీకి ఇక్కడే స్కానింగ్ చేయించాలని సూచించారు. పాలవ్యంచ, ఇల్లెందు, భద్రాచలం, రామవరం ఎంసీహెచ్‌ల్లో నెలకు వందకు స్కానింగ్‌లు జరిగేలా చూడాలన్నారు. అలాగే, గొత్తికోయ, కొండరెడ్ల గ్రామాల్లో గర్భిణుల ఆరోగ్యంపై శ్రద్ధ వహిస్తూ మాతాశిశు మరణాలు తగ్గించాలని సూచించారు. జిల్లా సంక్షేమ అధికారి విజేత, ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రామకృష్ణ, ఆర్ఎంఓ డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి డాక్టర్ నాగేంద్రతో పాటు డాక్టర్ కపిల్‌శర్మ, ఉజ్వల్, భార్గవ్, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.